



లక్కవరం గ్రామం వద్ద ఇప్పటికే పోసిన ఆకుమడి

తరగతి గది చిన్నబోయింది..

జిల్లాలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కరే విద్యార్థి

- ముగ్గురు ఉన్నవి మరికొన్ని..
- ఎలమంచిలి మండలంలో 10 మందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 15
- రామారాయుడుపాలెంలో ఒకటో తరగతి ఖాళీ
- తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లపై ఆసక్తి చూపిస్తుండడంతో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య



రేగుపాలెం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థికి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఎలమంచిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఈ ఏడాది మండలంలోని పలు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరకపోవడం విద్యాశాఖలో ఆందోళన కలిగిస్తోంది. పది మంది కూడా విద్యార్థులు లేని పాఠశాలలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.**

ఎలమంచిలి మండలంలో పది మందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 15కి పైగానే ఉన్నాయి. ఇదే మండలంలోని రేగుపాలెం ఫౌండేషన్ స్కూల్‌లో 1, 2 తరగతులకు ఇద్దరు మాత్రమే విద్యార్థులున్నారు. ఈ ఏడాది ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి చేరగా, రెండవ తరగతిలో ఒకే విద్యార్థిని మాత్రమే ఉంది. ఇక్కడి ఏకోపాధ్యాయుడు ఆనంద్‌రాజు వీరికి పాఠాలు బోధిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ, మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసింది. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించింది. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం నుంచే విద్యామిత్ర కిట్లతో పాటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసింది. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన బియ్యం వినియోగిస్తోంది. కానీ ఆశించిన స్థాయిలో విద్యార్థుల ప్రవేశాలు జరగడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల వయసు దాటిన పిల్లలు, పాఠశాలకు దూరంగా ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రతి ఏటా విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదికలు ఇస్తోంది. ఈ ఏడాది జూన్ 12 నుంచి నెల రోజుల పాటు ... మిగతా 6వ పేజీలో




నర్సీపట్నం కొత్తవీధి ఎంపీపీ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

నర్సీపట్నంలో...

నర్సీపట్నం అర్బన్: నర్సీపట్నం మండలంలోని తొమ్మిది మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది లోపు విద్యార్థులు ఉన్నారు. వీటిలో నర్సీపట్నంలోని కొత్తవీధి మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ముగ్గురు, పెద ఉప్పరగూడెంలో ఐదుగురు, బలిఘట్టంలో ఆరుగురు, వేములపూడిలో ఆరుగురు, అప్పన్నపాలెంలో ఏడుగురు, శ్రీరామపురంలో ఏడుగురు, నర్సీపట్నంలో ఎనిమిది, బంగారయ్యపేటలో తొమ్మిది, బైలులో తొమ్మిది మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడే బోధిస్తున్నారు.

ఆ పాఠశాలలో ఇద్దరే..

అచ్యుతాపురం: మండలంలోని చిప్పాడలో ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. గ్రామస్థులు ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) భూసేకరణలో సర్వస్వం కోల్పోయారు. గ్రామాన్ని తరలిస్తామని అధికారులు ప్రకటించారు. కొంతమంది నిర్వాసితులకు పరిహారంతో పాటు వెదురువాడ వద్ద ఇళ్ల స్థలాలను కేటాయించారు. వారంతా గ్రామం విడిచి వెళ్లిపోయారు. ప్యాకేజీ అందని వారు ఇక్కడ ఉండిపోయారు. గ్రామాన్ని తరలిస్తామన్న ఉద్దేశంలో పాఠశాల భవనానికి అధికారులు మరమ్మతులు చేయలేదు. దీంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పక్కనే ఉన్న తుఫాన్ రక్షిత భవనంలో నిర్వహిస్తున్నారు. పాఠశాల భవనం పరిస్థితి బాగా లేకపోవడంతో గ్రామంలోని చిన్నారులను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. దీంతో ఇక్కడ కేవలం ఇద్దరే విద్యార్థులున్నారు. అధికారులు స్పందించి భవనం మరమ్మతులు చేపడితే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు.



అచ్యుతాపురంలో ఇద్దరు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

అన్నదాత ఆనందం

ఆశాజనకంగా ఖరీఫ్ సీజన్ ఆరంభం



అన్నవరం గ్రామం వద్ద విత్తనాలు చల్లేందుకు ఆకుమడిని సిద్ధం చేస్తున్న రైతు

- అదునులో వర్షాలతో రైతుల సంబరం
- ఉత్సాహంగా ఆకుమడులు తయారీ, జోరుగా ఆకుపోతలు
- గత రెండేళ్లు ఆలస్యంగా వర్షాలతో సీజన్ జాప్యం
- ఈ ఏడాది సకాలంలో వర్షాలతో ఆగస్టు నెలాఖరు నాటికే వరినాట్లు పూర్తయ్యే అవకాశం

చోడవరం, జూలై 5: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగానే ప్రారంభం కావడంతో అన్నదాతల్లో ఆనందం నెలకొంది. సీజన్ ప్రారంభంలోనే అవసరమైన వానలు పడడంతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం గ్రామాల్లో అన్నదాతలు ఆకుమడుల తయారీతో పాటు ఆకుపోతలతో బిజీగా ఉన్నారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతంలో ఏటా జూలై నెల రెండో వారానికే చాలా చోట్ల వరినాట్లు ప్రారంభమై ఆగస్టు నెలాఖరునాటికి దాదాపుగా 80 శాతం పైగా వరినాట్లు పూర్తయ్యేవి. కానీ గత రెండేళ్లలో ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు వర్షాల కోసం ఎదురుచూపులు చూడక తప్పని పరిస్థితి ఎదురైంది. గత ఏడాది ఆగస్టు నెల చివరి వారానికి గానీ వరినాట్లు వేయలేకపోయారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు వాతావరణం కలిసి వచ్చింది. జూన్ నెల రెండవ వారం నుంచి అడపాదడపా వర్షాలు పడడంతో పాటు జూలై నెల ప్రారంభంలో కూడా వర్షాలు కాసింత మెరుగ్గానే కురవడం వ్యవసాయానికి ఊపిరిపోసినట్టయింది. అదునులో వర్షాలు కురియడంతో ప్రస్తుతం గ్రామాల్లో రైతులందరూ సాగు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రభుత్వం కూడా విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడంతో అన్నదాతలు విత్తనాలు చల్లే పనిలో పడ్డారు. ఈ ఏడాది ప్రారంభం నుంచీ వర్షాలు పడుతుండడంతో సాగు కు అనుకూల వాతావరణం ఏర్పడిందని, ఈ ప్రభావం వల్ల డివిజన్‌లో వరినాట్లు త్వరగా పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. బోర్లు, చెరువుల కింద ఇప్పటికే రైతులు ఆకుమడులు వేయగా, మిగిలిన ప్రాంతాల్లో రైతులు ఆకుపోతల కోసం మడులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇదే వాతావరణం కొనసాగే పరిస్థితులు కనిపిస్తుండడంతో ఈ నెల మూడవ వారం దాటిన తరువాత రిజర్వాయర్ల పరిధిలోనూ, వ్యవసాయ బోర్ల కింద వరినాట్లు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో కూడా నెలాఖరు నాటికి నాట్లు పడే పరిస్థితి కనిపిస్తున్నది.

నిండుగా రిజర్వాయర్లు

ఈ ఏడాది ఏజెన్సీ ప్రాంతంలో రెండు నెలల నుంచి వర్షాలు విస్తారంగా కురవడంతో మైదాన ప్రాంతంలోని రైవాడ, పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ రిజర్వాయర్లకు కూడా ఇన్‌ఫ్లో బాగానే పెరిగింది. దీంతో ఈ రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయి.

రిజర్వాయర్లు నిండుగా ఉం డడంతో వరినాట్లకు అవసరమైన సమయంలోనే నీరు విడుదల చేయడానికి మార్గం ఏర్పడింది. మొత్తం మీద చూస్తే ఈ ఏడాది సకాలంలో వర్షాలు ప్రారంభం కావడం అన్నదాతలకు ఆనందాన్ని ఇస్తుండగా, వరినాట్లు కూడా సకాలంలో పూర్తవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. చోడవరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని మండలాల్లో 13,071 హెక్టార్ల పరిధిలో వరి సాగవుతోంది. వాతావరణం సానుకూలంగా ఉండడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టు నెలాఖరు నాటికి దాదాపుగా 80 శాతం మేర వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

మద్యం నేరాలపై నిఘా నేత్రం

ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా 24 గంటలూ పర్యవేక్షణ

- కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు బాధ్యతలు
- జిల్లాలోని 8 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో యాప్ వినియోగం
- ఇప్పటికే సీసీ కెమెరాలను పబ్లిక్ ఐపీకి మార్చిన వైనం

నర్సీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): **మద్యం నేరాలపై ప్రభుత్వం నిఘాను కట్టుదిట్టం చేస్తోంది. ప్రభుత్వం, ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా వైన్‌షాపులపై అధికారుల పర్యవేక్షణను మరింత పెంచింది. ఇప్పటికే ప్రతీ మద్యం షాపు దగ్గర సీసీ కెమెరాలు తప్పనిసరి చేసి ప్రైవేటు ఐపీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్) నుంచి పబ్లిక్ ఐపీకి మార్చింది. ఇప్పటికి ఈ ప్రక్రియ 50 శాతం పూర్తయింది. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ కేబుల్స్ వేయడం పూర్తయితే సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తాయి. దీని వలన ఎక్సైజ్ స్టేషన్‌తో పాటు, జిల్లా కేంద్రం, అమరావతి నుంచి కూడా పర్యవేక్షణ సులభతరం చేశారు.**

తాజాగా ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులకు ఎక్సైజ్ నేత్రం (ఎక్సైజ్ ఐ) యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు యాప్‌ను స్మార్ట్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకున్నారు. మద్యం నేరాలపై కానిస్టేబుల్ దగ్గర నుంచి జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులు వరకు ఒక షెడ్యూల్ ప్రకారం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ మూడు రోజులకు ఒకసారి, అలాగే ఎస్ఐ, సీఐలు వారంలో ఒక రోజు వైన్ షాపులు తనిఖీలకు వెళ్లాలి. ఎక్సైజ్ స్టేషన్ నుంచి బయలుదేరే ముందే యాప్ ఓపెన్ చేసి ఆన్ చేయాలి. దీని వలన తనిఖీలకు వెళుతున్న అధికారి ప్రతీ కదలిక అమరావతి నుంచి పర్యవేక్షణ చేస్తారు. వారు ఏ వైన్ షాపు దగ్గరకు వెళ్లారు. ఏమేమి తనిఖీలు చేస్తున్నారు అన్న విషయాలు ఉన్నతాధికారుల గమనిస్తుంటారు. వెళ్లిన షాపు దగ్గర నుంచి ఫొటోలు తీయాలి. షాపులలో మద్యం లూజ్ సేల్స్ అంతరాష్ట్ర మద్యం ఏమైనా నిల్వలు ఉన్నాయా?, మద్యం దుకాణానికి అనుబంధంగా అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు నడుపుతున్నారా? అన్న విషయాలు పరిశీలిస్తారు. ఉదయం షిఫ్ట్‌తో పాటు రెగ్యులర్ షిఫ్ట్‌లో ఉదయం 10 గంటలు నుంచి రాత్రి 10 గంటలకు, నైట్ షిఫ్ట్‌లో రాత్రి 11 గంటలు నుంచి ఉదయం 5 గంటలు వరకు పర్యవేక్షణ తప్పనిసరి చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్ షాపులలో మద్యం లూజ్ విక్రయాలు చేయకూడదు. ఒక వ్యక్తికి మూడు మద్యం బాటిళ్లకు మించి ఇవ్వకూడదు. మద్యం బాటిల్ మీద ఉన్న నిర్ణీత ధర కంటే అధిక ధరకు విక్రయించ కూడదు. ఎక్సైజ్ ఐ యాప్ మొదటి విడత ట్రయల్ రన్ పూర్తి చేశారు. రెండో విడతలో బెల్టు షాపులు, బహిరంగ మద్యం, నాటు సారా నేరాలను యాప్‌లో సంక్షిప్తం చేయబోతున్నారు. యాప్ పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తే అధికారులకు చేతినిండా పని దొరుకుతుంది. మద్యం నేరాలు అదుపులోకి వస్తాయని భావిస్తున్నారు.



ఎక్సైజ్ ఐ యాప్



నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్

పబ్లిక్ ఐపీకి మార్చడంలో జాప్యానికి కారణం ఇది..

జిల్లాలో నర్సీపట్నం, గొలుగొండ, వి.మాడుగుల, చోడవరం, పాయకరావుపేట, ఎలమంచిలి, సబ్బవరం, అనకాపల్లి ... మిగతా 6వ పేజీలో



వేంకటేశ్వర స్వామి అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

వేంకటేశుని అవతారంలో జగన్నాథుడు

స్థానిక శ్రీకేశవస్వామి ఆలయంలో జగన్నాథుని దశ రూప మహోత్సవాల్లో భాగంగా శనివారం జగన్నాథస్వామి వేంకటేశ్వర స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. - చోడవరం/ఆంధ్రజ్యోతి

సుజల స్రవంతి పూర్తికి యత్నిస్తా

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెద్దలందరి సహకారంతో పోలవరం పూర్తవుతుందని, ఈ ప్రాంతానికి చెందిన సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తిచేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన్ను శనివారం అక్కయ్యపాలెం పోర్టు కళావాణి ... మిగతా 6వ పేజీలో

ఉల్లంఘనులపై ఉక్కుపాదం

నిబంధనలు పాటించని వాహనాలపై రవాణా శాఖ చర్యలు

- నెల రోజుల్లో రెండు సార్లు స్పెషల్ డ్రైవ్
- ఈ నెల ఒకటి నుంచి అమలులో..
- ఇప్పటి వరకు 44 కేసులు నమోదు
- రూ.97,480 జరిమానా

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి) **జిల్లాలో నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించేందుకు రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్ చేపడుతోంది. ప్రధానంగా రాయి క్వారీల నుంచి కంకర, బండరాళ్లను రవాణా చేసే లారీలు, టిప్పర్లు చాలా వరకు కాలం చెల్లినవి (ఫిట్‌నెస్ లేనివి)గా రవాణా శాఖాధికారులకు తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ లేని, నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి, అవసరమైతే సీజ్ చేసేందుకు జిల్లా రవాణా శాఖాధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.**

జిల్లాలో 1,250 లారీలు, 420 టిప్పర్లు, 580 ట్రాక్టర్లు, 1400 పైచిలుకు ఆటోలు ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా ప్రతి రోజు క్వారీల నుంచి కంకర, రోడ్డు మెటల్ రవాణా చేస్తుంటాయి. వీటిలో ఎక్కువ సంఖ్యలో ... మిగతా 6వ పేజీలో



అనకాపల్లి పట్టణం మీదుగా రాంబిల్లి వైపు వెళుతున్న నంబరు ప్లేటు లేని లారీ



స్కూల్ ఆటో ఫిట్‌నెస్ తనిఖీ చేస్తున్న ఎంవీఐలు

నిరంతరాయంగా వాహన తనిఖీలు

జిల్లాలో నిరంతరాయంగా వాహనాల తనిఖీలు చేపడతాం. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నెలలో రెండు రోజులు తనిఖీలు చేస్తాం. ప్రధానంగా లైసెన్స్ లేకుండా నడుపుతున్న భారీ క్వారీ వాహనాలు, ఫిట్‌నెస్ ధ్రువీకరణ లేని స్కూల్స్ బస్సులపై దృష్టి పెట్టాం.

- జి.మనోహర్, జిల్లా రవాణా శాఖాధికారి



లోక్ అదాలత్‌లో 1,114 కేసులు పరిష్కారం



ఎలమంచిలిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ

ఎలమంచిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కోర్టుల సముదాయం ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 1,114 కేసులు పరిష్కారమైనట్టు సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ జి.స్పందన, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రమేశ్‌ల ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి విజయ మాట్లాడుతూ ఒకే రోజు 1,114 కేసులు పరిష్కారమయ్యాయని, రాజీ పరిష్కారం నిమిత్తం వచ్చిన రుసుము కక్షిదారులకు చెల్లించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, లోక్ అదాలత్ సభ్యులు, ఏజీపీ డి.వెంకటరావు, లోక్ అదాలత్ మెంబరు పీవీ.రమణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'పోలవరం' కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన



కార్యాలయ మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఇందిరా సాగర్ పోలవరం ఎడమ ప్రధాన కాలువ సమీపంలో హైవే పక్కన రూ.2.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న డివిజనల్ నంబరు-5 కార్యాలయ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు ఈ కార్యాలయం అద్దె భవనాల్లో కొనసాగేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక శాశ్వత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యాలయం నిర్మాణానికి సంబంధించిన మ్యాపును ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు, కాంట్రాక్టర్ పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పోలవరం కాలువ ఈఈ రామకోటేశ్వరరావు, డీఈ భాస్కరరావు, సిబ్బంది, కూటమి నేతలు లవుడు లోవరాజు, ఊటకూటి రమేశ్, బొద్దపు శ్రీను, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కొఠారు శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరావు, గెంజి శ్రీను, గుప్తా పాల్గొన్నారు.

ఎర్రయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే

అచ్యుతాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన చోడిపల్లి ఎర్రయ్య కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం ఆయన పూడిమడక శివారు కొండపాలెంలో ఎర్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎర్రయ్య ఆచూకీ కోసం కోస్టు గార్డులతో పాటు ప్రత్యేక హెలీకాప్టర్‌లు గాలిస్తున్నాయన్నారు. ఒడిశా తీరం వరకు గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, మేరుగు బాపునాయుడు, మేరుగు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దిమిలిలో పారిశుధ్య పనులపై డీపీవో అసంతృప్తి

» తక్షణమే ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం



దిమిలిలో సమస్యలు తెలుసుకుంటున్న డీపీవో సందీప్

రాంబిల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలిలో జిల్లా పంచాయతీ అధికారి సందీప్ శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. కాలువలు, మంచినీటి ట్యాంకులు, సంపద కేంద్రాలను చూసి అధ్వానంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితుల మెరుగుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. సంపద కేంద్రం లక్ష్యానికి అనుగుణంగా పనిచేసేలా తీర్చిదిద్దాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థులకు పారిశుధ్యంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయడంతో పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రాజు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

» 'సుపరిపాలనలో తొలి అడుగు'లో టీడీపీ నేతలు



అచ్యుతాపురం మండలం గొర్లెధర్మవరంలో పథకాల కరపత్రాలను చూపుతున్న ప్రగడ

అచ్యుతాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యమని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గొర్లె ధర్మవరంలో శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తున్నట్టు చెప్పారు. ప్రజారంజక పాలన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి అప్పులే తప్ప, అభివృద్ధి జరగలేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, నాయకులు కాండ్రేగుల అప్పారావు, దేశంశెట్టి వెంకటరమణ, నీరుకొండ నర్సింగరావు, యాండ్ర అప్పలనాయుడు, పతివాడ చిన్నయ్యనాయుడు, రావి శ్రీను, పెంటారావు, గొర్లె సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.



13వ వార్డులో మహిళకు కరపత్రం అందిస్తున్న నాయకులు

ఎలమంచిలి : అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తున్నట్టు మునిసిపాలిటీ 13వ వార్డు టీడీపీ నాయకులు కె.మల్లికార్జున, ఎస్.కె.సాహెబ్, కరణం రవికుమార్ అన్నారు. వార్డులోని పార్టీ శ్రేణులతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నేడు జగన్నాథస్వామి పండుగ



మునగపాకలో కొలువుదీరిన స్వామివారు

మునగపాక, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని పలు గ్రామాల్లో జగన్నాథస్వామి పండుగ ఆదివారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి ఆయా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వారం రోజులుగా మండల కేంద్రం మునగపాక ఇంద్రద్యుమ్న హాలులో బలరాం, సుభద్ర సమేతంగా పూజలందుకుంటున్న జగన్నాథస్వామి వారి తిరుగు రథోత్సవం కూడా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

'టీడీపీలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు'

మునగపాక, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో ఆఖరి వరుసలో ఉన్న కార్యకర్తకు సైతం గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం మండల తెలుగు రైతు అధ్యక్షుడుగా ఎన్నికైన మళ్ల శేషును ఘనంగా సత్కరించారు. జిల్లా తెలుగు రైతు కార్యదర్శి మళ్ల వరహానర్సింగరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, రాము పాల్గొన్నారు.

నేడు ఉచితంగా రేబిస్ వ్యాక్సినేషన్

ఎలమంచిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం ఇక్కడి ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో ఉచిత రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పశువైద్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సిహెచ్.ఎం.ఎం. గంగాధర్ తెలిపారు. పెంపుడు జంతువులకు ఈ వ్యాక్సిన్ వేయనున్నట్టు చెప్పారు.

'గురజాపాలెంలో ఆటిజం సహాయ కేంద్రం ఏర్పాటు'

అచ్యుతాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సెజ్ పునరావాస కాలనీ దిబ్బపాలెం పంచాయతీ గురజాపాలెంలో ఆటిజం సహాయ కేంద్రంతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఆటిజం కేంద్రాల నిపుణుడు శ్రీరామ్ కమల్ మనోజ్‌తో కలిసి ఆయన శనివారం గురజాపాలెంలో గల పాఠశాల ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేయబోయే కేంద్రంలో ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, ఒకేషనల్ ట్రైనింగ్ లెర్నింగ్ సపోర్ట్ రూమ్స్, కంపూటర్ ల్యాబ్, సైన్స్, మాథ్స్ రోబోటిక్స్ ల్యాబ్, అడ్వాన్స్‌డు ఫిజియో న్యూరో ఎబిలిటీ రిహేబిటేషన్ సెంటర్ వంటివి ఉంటాయన్నారు. అంతేకాకుండా కోస్టల్ ఆంధ్రలో ఉన్న ప్రత్యేక ఉపాధ్యాయ సిబ్బందికి ఆటిజంపై శిక్షణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి హైడ్రో థెరపీ (ఈత కొలను)కూడా ఏర్పాటుచేస్తామని వివరించారు. నాయకులు బైలపూడి శ్రీరామ దాసు, రాజాన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాతవీధి ప్రధాన రోడ్డుపై కంటైనర్ బీభత్సం

» విద్యుత్ వైర్లు లాక్కుంటూ వెళ్లడంతో చెలరేగిన మంటలు
» భయాందోళన చెందిన స్థానికులు » అర్ధరాత్రి ఘటన
» విద్యుత్ సిబ్బంది సరఫరా నిలిపేయడంతో తప్పిన ప్రమాదం



వాహనం వైర్లు లాక్కుంటూ వెళుతున్నపుడు చెలరేగిన మంటలు

ఎలమంచిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దిమిలి రోడ్డు జంక్షన్ పాతవీధి ప్రధాన రోడ్డుపై అర్ధరాత్రి ఓ కంటైనర్ బీభత్సం సృష్టించింది. విద్యుత్ వైర్లను లాక్కుంటూ వెళ్లిన దృశ్యం అక్కడివారిని భయాందోళనకు గురిచేసింది. ఆ సమయంలో వైర్లు తెగిపోయి మంటలు రావడంతో మరింత హడలిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. ఎలమంచిలి నుంచి దిమిలి రోడ్డు జంక్షన్ మీదుగా అచ్యుతాపురం వైపు కంటైనర్ వాహనం శుక్రవారం అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో వెళుతోంది. ఆ వాహనం ఒక్కసారిగా రోడ్డుపై ఉన్న విద్యుత్ వైర్లను లాక్కుని వెళ్లింది. ఆ సమయంలో వైర్లు తెగిపడి మంటలు వ్యాపించాయి. అయినప్పటికీ సదరు వాహనాన్ని ఆపకుండా డ్రైవర్ ముందుకు సాగాడు. స్థానికులు విద్యుత్ సిబ్బందికి వెంటనే సమాచారం అందించడంతో వారు సరఫరాను నిలిపివేశారు. అయితే ఈ సంఘటన అర్ధరాత్రి జరగడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శనివారం ఉదయం నుంచి విద్యుత్ సిబ్బంది దెబ్బతిన్న విద్యుత్ స్తంభాన్ని మార్పు చేసి వైర్ల మరమ్మతులు చేపట్టారు.

సుజల స్రవంతి పూర్తికి యత్నిస్తా



పీవీఎన్ మాధవ్‌ను సన్మానిస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు

... 5వ పేజీ తరువాయి

కల్యాణ మండపంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి తదితరులు హాజరై మాధవ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, తనపై ప్రేమతో ఇంత మంది వచ్చి అభినందనలు తెలిపారని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎప్పుడూ కృషిచేస్తానని, అందరితో సమన్వయంతో ముందుకు వెళతానని చెప్పారు.

తరగతి గది చిన్నబోయింది..

... 5వ పేజీ తరువాయి



కొత్త యర్రవరం పాఠశాలలో ముగ్గురికి పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయిని

పిల్లల నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినా ఫలితం లేకుండా పోతోంది. ప్రైవేటు పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది.ఎలమంచిలి మండలంలోని కొన్ని పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరనిపాఠశాలలున్నాయంటే పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థమవుతోంది. ఇక్కడ ఫౌండేషన్ పాఠశాలలు 4, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు 33తో పాటు మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 51 ఉన్నాయి. 3,482 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా పది మంది కంటే తక్కువమంది విద్యార్థులున్న పాఠశాలలు 15 వరకు ఉన్నాయి. రేగుపాలెం ఫౌండేషన్ పాఠశాలలో ఇద్దరు, కొత్త యర్రవరంలో ముగ్గురు విద్యార్థులే ఉన్నారు. లైను కొత్తూరులో 9 మంది, సోమలింగ పాలెం, మర్రిబంద, కేపీ పురంపాఠశాలల్లో నలుగురి చొప్పున ఉన్నారు.రామారాయుడుపాలెంలో ఎవరూ చేరకపోవడంతో ఒకటో తరగతి ఖాళీగా ఉంది.

ప్రైవేటు పాఠశాలలపై ఆసక్తి

ప్రధానంగా ప్రైవేటు పాఠశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపుతుండడమే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణమని భావిస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ కుటుంబాల ప్రజలు పనుల నుంచి సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత వస్తుంటారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే సాయంత్రం 4 గంటలకే ఇంటికి వస్తారని, తాము వచ్చే వరకు వారి పర్యవేక్షణ ఇబ్బంది అవుతోందని, అదే ప్రైవేటు పాఠశాలలైతే సాయంత్రం 6 గంటల తరువాత పంపుతారని చెబుతున్నారు. ఈ విషయమై జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.అప్పారావు వివరణ కోరగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని చెప్పారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల చేరికకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి రోజూ ప్రణాళికాబద్ధంగా తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తున్నట్టు చెప్పారు.

మద్యం నేరాలపై నిఘా నేత్రం

... 5వ పేజీ తరువాయి

ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో 161 ప్రైవేటు వైన్ షాపులు ఉన్నాయి. అన్ని వైన్ షాపుల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రైవేటు ఐపీ నుంచి పబ్లిక్ ఐపీకి మారాలంటే బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ కనెక్షన్ ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు ఐపీ నుంచి ప్రైవేటు ఐపీకి మార్చేశారు. కాస్త మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేదు. కొన్ని గ్రామాలలో సిగ్నల్స్ సమస్య కారణంగా అవాంతరం ఏర్పడుతుందని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని చోట బీఎస్‌ఎన్‌ఎల్‌తో మాట్లాడి వేయిస్తున్నారు. ఇప్పటి వరకు 50 శాతం వైన్ షాపులలో పబ్లిక్ ఐపీకి మార్చడం జరిగింది. ఇంటర్నెట్ కనెక్షన్ లేని చోట బీఎస్‌ఎన్‌ఎల్ కేబుల్స్ వేస్తున్నారు. త్వరలో సీసీ కెమెరాలు కూడా నూరుశాతం కంట్రోల్ రూమ్‌ల పరిధిలోకి వస్తాయని అధికారులు అంటున్నారు. తొలి విడత ఎక్సైజ్ ఐ యాప్ ట్రయల్ రన్ పూర్తి చేసినట్టు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సుర్జిత్‌సింగ్ తెలిపారు. రెండో విడతగా మద్యం, నాటు సారా నేరాలను కూడా ఎక్సైజ్ యాప్‌లో చేర్చబోతున్నారని తెలిపారు. దీని వలన మోనటరింగ్ పెరుగుతుందని, మద్యం, నాటు సారా నేరాలపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఉల్లంఘనులపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

భారీ వాహనాలు బండరాళ్లను అనకాపల్లి, వయా ఎలమంచిలి మీదుగా, మరికొన్ని రేలుగుంట, మాకవరపాలెం మీదుగా రాంబిల్లి వైపు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. వందలాది ఇసుక ట్రాకర్లు నిత్యం జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే పరిమితికి మించి విద్యార్థులతో స్కూల్ ఆటోలు తిరుగుతున్నాయి. వీటిపై రవాణా శాఖ దృష్టి పెట్టింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తోంది. నెలలో రెండు రోజులు ఈ డ్రైవ్ కొనసాగనుంది. ఇప్పటి వరకు 44 కేసులు నమోదు చేసి రూ.97,480 జరిమానా విధించారు. ఎంవీఐలు రమణ, రాజన్న, వెంకటరావు బృందం వాహనాలను తనిఖీ చేసి పర్మిట్ లేకుండా నడుపుతున్న వాటిని సీజ్ చేస్తున్నారు.

మత్స్యకార కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి



హోం మంత్రికి వినతిపత్రం అందజేసిన మత్స్యకార సంఘ నేతలు

నక్కపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి మత్స్యకారుడు చోడిపల్లి ఎర్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని నక్కపల్లి మండలానికి చెందిన మత్స్యకార సంఘ ప్రతినిధులు హోం మంత్రి అనితను కోరారు. ఎర్రయ్య ఇటీవల సముద్రంలో వేట సాగిస్తుండగా, కొమ్ముకోనాం చేప వలకు చిక్కడంతో దానిని లాగే సమయంలో అతని కాలికి తాడు తగులుకుని సముద్రంలో పడిపోయినట్టు హోం మంత్రికి వివరించారు. ఇలాంటి సంఘటనల్లో మృతదేహాలు బయటకు రావని, అందువల్ల ఎర్రయ్య డెత్ సర్టిఫికెట్‌ను ఆకుటుంబానికి మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు బొంది కాశీ విశ్వనాథ్, గోసల చిన తాతారావు, కారే కృష్ణ, పిక్కి రాంబాబు, గరికిని సింహాద్రి, వాసుపల్లి అడవిరాజు, వాసుపల్లి శివ, సిరిపిల్లి అప్పలరాజు ఉన్నారు.

మద్యం పట్టివేత

ఎస్. రాయవరం, జూలై (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం లో శనివారం 45 (180 ఎంఎల్) మద్యం బాటిళ్లతో పాటు ఖాళీ సీసాల్లో నిల్వచేసిన నాలుగున్నర లీటర్ల విడి మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అందుపులోకి తీసుకున్నట్టు పాయకరావుపేట ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. అడ్డరోడ్డులోని మద్యం షాపు వద్ద నుంచి బాటిళ్లను కొనుగోలు అక్రమంగా విక్రయిస్తున్నట్టు సమాచారం వచ్చిందన్నారు. ఈ క్రమంలో దాడి చేసి 45 బాటిళ్లతోపాటు విడి మద్యాన్ని గుర్తించామన్నారు. ఈ కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

తొలి ఏకాదశికి ఉపమాక క్షేత్రం ముస్తాబు

నక్కపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రం తొలి ఏకాదశి పర్వదినానికి ముస్తాబయింది. ఆదివారం కొండపైనున్న స్వామివారి నిజరూపానికి తెల్లవారుజామున పంచామృతాభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ప్రధానార్చకుడు ప్రసాదాచార్యులు చెప్పారు. కింద ఆలయంలో ఉన్న ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి, ఉపాలయాల్లో వున్న దేవతామూర్తులను ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దర్శించుకోవచ్చునని చెప్పారు. మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకు దర్శనాలుంటాయన్నారు. ఉదయం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేపడతారు.

మాక్ డ్రిల్



కేశవరం సమీపంలోని డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లో సూచలందిస్తున్న అధికారులు

పాయకరావుపేట రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరం సమీపంలోని డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ సెజ్‌ల్లో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫాక్టరీస్ పరమేశ్వరరావు పర్యవేక్షణలో శనివారం ప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. తెలంగాణలోని సిగాచీ ఫార్మాలో ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో ఈ మాక్ డ్రిల్లు నిర్వహిస్తున్నట్లు పరమేశ్వరరావు తెలిపారు. కంపెనీ సిబ్బందితో మాట్లాడుతూ ఫ్యాక్టరీలలో ఎమర్జెన్సీ సమయంలో ఇలాంటి మాక్‌డ్రిల్లు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగులు అవగాహనతో స్పందించి ప్రాణాలను రక్షించవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో డెక్కన్ కెమికల్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి జోలికెళితే పథకాలు నిలిపివేత

» కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం
» నాడు-నేడు పేరిట వైసీపీ నేతలు దోపిడీ చేశారు..
» హోం మంత్రి వంగలపూడి అనిత



ధర్మవరం అగ్రహారంలో అనితను సన్మానిస్తున్న మహిళలు

ఎస్. రాయవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేసినా, తాగినా సంబంధిత కుటుంబాలకు సంక్షేమ పథకాలను నిలిపివేసే అవకాశం ఉందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో టీడీపీ మండల యువత అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హోం మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాలన అందిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా ఉండేదని, ఈ స్థితిలో కుటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈగల్ అనే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి గంజాయిపై ఉక్కుపాదం మోపిందన్నారు. చాలా మేరకు గంజాయి సాగు తగ్గించామన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీల నిధులు మాయమయ్యాయన్నారు. దీంతో గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లడానికి సర్పంచ్‌లు ఇబ్బంది ఎదుర్కొన్నారు. నాడు-నేడు పేరుతో ఆ పార్టీ నేతలు అడ్డంగా దోచుకున్నారన్నారు. మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు పెన్షన్ రూ. 3 వేలకు పెంచారన్నారన్నారు.తల్లికి వందనం పథకం అర్హులైన పిల్లలందరికీ వర్తిస్తున్నట్టు చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రాంభిస్తారన్నారు. అలాగే, పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించినట్లు చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో బల్క్‌డ్రగ్ పార్కు, స్టీల్, బొమ్మల పరిశ్రమలు రానున్నాయన్నారు. నియోజవర్గంలోని యువతకు 20 వేలు, పరిసర జిల్లాల వారికి లక్షకు పైగా ఉద్యోగాలు రానున్నాయన్నాన్నారు. తమ ప్రభుత్వం ఈ ఏడాదిలో ఒక్క ధర్మవరం అగ్రహారంలోనే రూ. 40 లక్షలతో రోడ్లు నిర్మించినట్టు వివరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి హోం మంత్రి అభివృద్ధిని వివరించారు. గ్రామంలో రూ 8.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన పల్లా అప్పలరాజును అనిత పరామర్శించారు. తొలుత హోం మంత్రికి స్థానిక మహిళలు ఘనంగా సన్మానించారు. తరువాత దుర్గాదేవిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలిగట్ల రత్నం, టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, నాయకులు ఎన్.వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, నాయకులు సుంకర శ్రీనివాసరావు, సియ్యాదుల అచ్యుత్‌కుమార్, బండి నాగేశ్వరరావు, పల్లెల జగ్గారావు, పడమర సతీశ్, అధికారులు పాల్గొన్నారు.

కోటవురట్లలో ఆక్రమణల గుర్తింపు



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

కోటవురట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను రెవెన్యూ అధికారులు సర్వే ద్వారా గుర్తించారు. వర్షాకాలంలో ఈ రోడ్డులో నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 3వతేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'వర్షంవస్తే..నరకం శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అర్‌అండ్‌బీ ఏఈ నారాయణరెడ్డి, మండలషత్ అధికారులు రహదారిని పరిశీలించారు. ఏదో ఒకవైపు డ్రైనేజీ కాలువ నిర్మిస్తే నీటి నిల్వ సమస్య తొలగుతుందని గుర్తించారు.దీనిపై తహశీల్దార్ తిరుమలబాబుతో చర్చించారు. అనంతరం శనివారం సర్వే చేపట్టారు.

పార్టీలకు అతీతంగా సేవలు: ఎంపీపీ

ఎస్. రాయవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో గల ప్రజలకు పార్టీలకు అతీతంగా అన్ని రకాల సేవలందిస్తానని ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. ఎంపీపీగా బొలిశెట్టి గోవిందరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ సీనియర్ నాయకుడు కొణతాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులుతో పాటువైసీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, మాజీ ఎంపీపీ కోన లోవలక్ష్మి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, ఎంపీ టీసీ సభ్యులు సేనాపతి రాము, బైపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు

పాయకరావుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ విజయవంతానికి కృషి చేయాలని తహశీల్దార్ మహేశ్వరరావు కోరారు. శనివారం తర కార్యాలయంలో పెరెంట్ టీచర్ మీటింగ్స్ మండల స్థాయి కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



పీర్లను దర్శించుకుంటున్న తోట నగేశ్ తదితరులు

పాయకరావుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మొహరం పురస్కరించుకుని పాయకరావుపేటలోని పెదపీర్ల పంజావీధిలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. అస్సేన్, హుస్సేన్ సోదరులు వీరమరణం పొందిన రోజును పురస్కరించుకుని నిర్వహించే మొహర్రం సందర్భంగా పంజా వీధిలో ముస్లింలు, హిందువులు కలిసి ఏటా ప్రత్యేక పూజలు, అగ్నిగుండం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో శుక్రవారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ దర్శించుకున్నారు. ఆయన అగ్నిగుండాన్ని ప్రారంభించారు. ముస్లిం సంఘం నాయకులతోపాటు వామాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

10న 'మెగా పేరెంట్- టీచర్స్ మీట్'

» అధికారులు విజయవంతం చేయాలి

» వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్- టీచర్స్ మీట్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో తల్లికి వందనం అమలు, మెగా పేరెంట్- టీచర్స్ మీట్ కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1.87 లక్షల మంది పాఠశాలల విద్యార్థులు, 25 వేల మంది జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉన్నారన్నారు. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గిరిజన, సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్- టీచర్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆయా పాఠశాలల ప్రాంగణాలను సర్వాంగసుందరంగా అలంకరించి విద్యార్థుల తల్లిదండ్రులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి ఈ సమావేశాలు నిర్వహించాలన్నారు. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పథకం కింద ఇప్పటికే నగదు జమ చేసినట్టు చెప్పారు. ఆధార్ నంబర్లు, బ్యాంక్ ఖాతాలు సక్రమంగా లేనివారికి సరిచేసి రెండో విడతలో ఈ నెల పదో తేదీన వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో సత్యనారాయణరావుతో పాటు సీపీవో జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

జునోటిక్ వ్యాధులపై అవగాహన అవసరం

» జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు



డాక్టర్ రామ్మోహన్‌రావు

అనకాపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జునోటిక్ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.రామ్మోహన్‌రావు అన్నారు. ఆదివారం ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. జంతువుల నుంచి రేబిస్, మెదడువాపు, చికెపాక్స్, బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ, ఎబోలా, నిఫా వంటి వైరల్ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. అంతేకాకుండా జంతువుల బ్యాక్టీరియా నుంచి ఆంత్రాక్స్, బ్రూసొల్లెసిస్, లెఫ్టోస్పైరోసిస్, లిష్టీరియోసిస్, క్షయ వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పిచ్చి కుక్క కాటుతో రేబిస్ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. జిల్లాలో జంతువుల నుంచి మానవాళికి సంక్రమించే వ్యాధులను నివారించేందుకు జిల్లాలో 20,040 రకాల డోసులు సిద్ధంగా ఉన్నాయన్నారు. వివిధ మండలాల్లోని 80 పశు వైద్యాలయాల్లో వీటిని అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ప్రపంచ జోనోసిస్ డే సం దర్భంగా అనకాపల్లిలోని శంకరన్ భవన్‌లో జంతువుల ద్వారా మానవాళికి సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరు కానున్న ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

నేటి నుంచి శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న నిర్వాహకులు, అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆలయ మాజీ ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలిరోజు ఉదయం పది గంటలకు సంకల్పం దీక్ష ధారణ, పంచ గవ్యప్రాసన వంటివి జరుపుతామన్నారు. 12వ తేదీ వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయని వివరించారు. చివరి రోజు శనివారం రాత్రి స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, ప్రసాద్, రాజేష్, మాజీ ధర్మకర్తలు గోలి మురళి, సీహెచ్.నూకరాజు, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పెంచిన ట్రూ అప్ చార్జీలను తక్షణమే తగ్గించి, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్ద చేస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. అలాగే, ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడే అదానీతో సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.ఫణీంద్రకుమార్, పరమేశ్వరి, వియ్యపురాజు, గొర్లి దేముడుబాబు, కోరిబిల్లి శంకర్రావు, కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు, ఫ్లైయాష్ లారీలు నిబంధనలు పాటించాలి

» అతిక్రమిస్తే చర్యలు : ఎమ్మెల్యే పంచకర్ల హెచ్చరిక

పరవాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ, దేశపాత్రునిపాలెం, లంకెలపాలెం మీదుగా బొగ్గు, ఫ్లైయాష్‌తో రాకపోకలు సాగిస్తున్న లారీలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా లారీలు రాకపోకలు సాగించడం వల్ల ప్రమాదాలు జరుగుతుండడంతో పాటు రహదారులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఇదే విషయమై ఆయా లారీల యాజమాన్యాలకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికే పరవాడ, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని వివరించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న లారీల యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోతే ప్రజల తరఫున పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. రవాణా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఈ విషయమై దృష్టి సారించాలన్నారు. వారం రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి కాకపోతే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

కేసుల పరిష్కార వేదిక లోక్ అదాలత్

» పదవ అదనపు జిల్లా జడ్జి నరేష్



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి నరేష్

అనకాపల్లి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని పదవ అదనపు జిల్లా జడ్జి నరేష్ అన్నారు. అనకాపల్లి కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోకుండా ఎదురైన ఆర్థిక, ఇతర గొడవలతో కేసులు పెట్టుకొని కాలంతో పాటు ఆర్థికంగా నష్టపోకూడదని వివరించారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కక్షిదారుల ప్రయోజనార్థం సుప్రీంకోర్టు వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. సబ్‌కోర్టు జడ్జి నాగేశ్వరరావు, అడిషినల్ సబ్‌కోర్టు జడ్జి రామకృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు, మొదటి అదనపు తరగతి సివిల్ జడ్జి రమేష్, రెండవ అదనపు తరగతి సివిల్ జడ్జి విజయలక్ష్మి, మూడవ అదనపు తరగతి సివిల్ జడ్జి నిఖిత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లా హర శ్రీనివాసరావు, కార్యదర్శి బంధం వెంకటరమణ, ఉపాధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఉదయం నుంచి సాయంత్ర వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 1398 కేసులు పరిష్కారమైనట్టు కోర్టు విభాగం అధికారులు తెలియజేశారు.

గిరి ప్రాంతాల్లో పెరుగుతున్న చెరకు విస్తీర్ణం

» ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ముకుందరావు



ముగింపోత్సవంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో చెరకు సాగు విస్తీర్ణం ఇటీవల కాలంలో పెరుగుతోందని, గిరిజన రైతులు బెల్లం తయారీ ద్వారా ఆదాయాన్ని సంపాదిస్తున్నారని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. అఖిల భారత చెరకు సమన్వయ పరిశోధనా పథకం, గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా గిరిజన రైతులకు చెరకు సాగు విధానాలపై ఆర్ఏఆర్ఎస్‌లో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు విలువ ఆధారిత వస్తువులను తయారుచేస్తే ఆదాయం మరింత పెరుగుతుందన్నారు. గిరిజన రైతులకు చెరకులో వివిధ సాగు పద్ధతులు, సాంకేతిక పద్ధతులపై చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి శిక్షణ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజన రైతులు, చెరకు పాత రకాలతో పాటు అధిక దిగుబడిని ఇచ్చే రకాలను వ్యాప్తిలోకి తేవాలని ఆమె సూచించారు. 10, 15 కిలోల బరువు తూగే బెల్లం అచ్చులకు బదులు చిన్న బెల్లం అచ్చులను తయారుచేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. గిరి రైతులు సేంద్రీయ పద్ధతుల్లో చెరకు సాగు చేయడం వల్ల బెల్లం నాణ్యత బాగుంటుందని, అయితే తయారీలో మెలకువలు పాటించకపోవడం వల్ల బెల్లం రంగు నల్లగా ఉంటోందన్నారు. మంచి రంగు గల బెల్లం తయారీపై ఆమె సూచనలు ఇచ్చారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.చంద్రశేఖర్ చెరకును ఆశించే తెగుళ్ల గురించి, మరో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.భవాని చెరకును ఆశించే కీటకాల నివారణపై శిక్షణిచ్చారు. బెల్లం తయారీతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులకు అవసరమైన పరికరాలను, చెరకు నరికే కత్తులను, కోకో పీట్, జీవన ఎరువులు, కిలో బెల్లం తయారీ చట్రాలను రైతులకు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ కేవీ రమణమూర్తి, తదితరులు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. గిరిజన ప్రాంతాలకు చెందిన 25 మంది రైతులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

సమస్యలపై మునిసిపల్ కార్మికుల ఆందోళన

» గ్రాడ్యుటీ, డీఏ విడుదలకు నినాదాలు

అనకాపల్లి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోన లక్ష్మణ మాట్లాడుతూ మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, పదవీ విరమణ పొందిన వారికి గ్రాడ్యుటీ సత్వరమే విడుదల చేయాలన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు కావడం లేదని వాపోయారు. దీంతో ఒకవైపు సంక్షేమ పథకాలు అందక, మరోవైపు పిల్లల ఉన్నత చదువులు, కుటుంబ పోషణ, రవాణా ఖర్చులు పెరిగి ఉద్యోగులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల నరసింహమూర్తి, యర్రంశెట్టి అప్పలరాజు, బంగారి రవి, సోమాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు పంచాయతీలో మెగా పార్కు

» స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే కొణతాల, కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలో 5.68 ఎకరాల విస్తీర్ణంలో మెగా పార్కు నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి శనివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్థల పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాఖలో జరిగిన వీఎంఆర్‌డీఏ సమావేశంలో కొత్తూరు పంచాయతీ పరిధిలో రూ.5.35 కోట్లతో మెగా పార్కు నిర్మాణానికి ఆమోదం లభించిందన్నారు. త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు, పెద్దలు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేలా ఏర్పాట్లు చేయనున్నామని వివరించారు. పిల్లలకు ఆటస్థలం, యోగా సాధనకు ఏర్పాట్లు చేయనున్నామన్నారు. బాస్కెట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్ , ఫుట్‌బాల్ కోర్టులు నిర్మించనున్నట్టు చెప్పారు. చుట్టు పక్కల ప్రాంతాలకు తలమానికంగా ఉండేలా మెగా పార్కు రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చదరం నాగేశ్వరరావు, మేడిశెట్టి సత్తిబాబు, సత్యగోవింద, జ్యోతుల గణేశ్, నీటిపల్లి రాజు, మళ్ల శ్రీను, మళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'క్వారీ యజమానులతో అధికారుల కుమ్మక్కు'

అనకాపల్లి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని క్వారీ యజమానులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్న మైనింగ్ శాఖలోని అధికారులు, సిబ్బం దిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని అనేక క్వారీల యజమానులు అనుమతుల కన్నా పదిరెట్లు పైగా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో వక్తలు



వేల్పుల వీధిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పీలా గోవింద

అనకాపల్లి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం వేల్పులవీధి, రజక కాలనీల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. పథకాల గురించి వివరించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లదేనన్నారు. 83వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బొద్దపు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, పొలిమేర ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



మొగలిపురంలో మహిళకు కరపత్రం అందిస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ పిలుపునిచ్చారు. మండలంలోని సబ్బవరం, మొగలిపురంలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన విస్తృతంగా పర్యటించారు. పలువురి ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి వంశీదీప్, తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, పల్ల తాతారావు, కోరాడ శ్రీనివాసరావు, లెక్కల అప్పలనాయుడు, కోన సోమేశ్వరరావు, అక్కుబాబు, గెద్దం రమేశ్, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆందోళన

అనకాపల్లి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రెండో రోజు శనివారం కూడా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జోనల్ అధ్యక్షుడు కె.జె.సుధాకర్ మాట్లాడుతూ ఆరేళ్లగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు త్వరగా ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్షుడు రాజేశ్వరరావు, కార్యదర్శి రమణ, నాయకులు కె.లక్ష్మి, రమణి, బీఎస్ రావు, కేఎం రావు, ఎంఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

» కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి అమర్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. శనివారం రాత్రి స్థానిక రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు మోసపూరిత హామీలు ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కరోనా వంటి పరిస్థితులను సైతం సమర్థవంతంగా ఎదర్కొని సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. వైసీపీ పట్టణశాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పరిశీలకురాలు శోభాహైమావతి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మలసాల కిశోర్, గ్రైహూరి రాజు, కేఎం నాయుడు, కోరుకొండ రాఘవ, వేగి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధునిగా జగన్నాథస్వామి



బుద్ధుని అవతారంలో దర్శనమిస్తున్న స్వామివారు

అనకాపల్లి టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గూడ్స్ షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న మందిరంలో కొలువైన సుభద్ర, బలభద్ర, జగన్నాథస్వామి శనివారం బుద్ధుని అవతారంలో దర్శనమిచ్చారు. వేకువజామున అర్చకులు విశేష అలంకరణలు, పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ దాడి బుజ్జి, ఈవో మురళీ, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇదిలావుంటే, స్వామిని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ దంపతులు దర్శించుకున్నారు. అలాగే, కశింకోట వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువుదీరిన జగన్నాథ స్వామి బుద్ధుని అవతారంలో దర్శనమిచ్చారు.

ముగిసిన వారాహీ నవరాత్రి ఉత్సవాలు



సబ్బవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవీపురంలో వారాహీ నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజామున విశేష అలంకరణలు చేపట్టిన అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం వారాహీ సహస్రనామావళి హోమాన్ని జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గురుపత్ని అన్న పూర్ణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సినేషన్

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి జయరాజు



పాడేరురూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పెంపుడు శునకాలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి.జయరాజు శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకు 3,600 రేబిస్ వ్యాక్సిన్ డోసులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. అన్ని మండల కేంద్రాల్లో ఉన్న పశువుల ఆసుపత్రులకు ఈ రేబిస్ డోసులు పంపిణీ చేశామన్నారు. పెంపుడు శునకాలు ఉన్న యజమానులు పశువుల ఆసుపత్రులకు తమ వాటిని తీసుకు వచ్చి ఈ టీకాలు వేయించాలని ఆ యన కోరారు. ఈ అవకాశాన్ని యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుంతుర్లలోని సమస్యలపై వినతి



కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న జీఎస్‌యూ నాయకులు

పెదబయలు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోపి కుంతుర్ల పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను గిరిజన విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షుడు మణుగూరి బాబూజీ కోరారు. శనివారం పాడేరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రమిచ్చారు. కుంతుర్ల పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాలకు సరైన రోడ్డు, తాగడానికి నీరు, సీసీ రోడ్లు తదితర సదుపాయాలులేక గిరిజనులు అవస్థలు పడుతున్నట్టు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలకు సరైన భవనాలు లేవని తెలియపరిచారు. సమస్యలను అధికారులకు వివరించినా స్పందన కొరవడిందని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వచ్చిన ఆర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. పరిష్కారానికి హామీ ఇచ్చినట్టు బాబూజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజన్, స్థానికులు పాల్గొన్నారు.

'నాసిరకంగా జాతీయ రహదారి పనులు'



బీటలు వారిన రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

హుకుంపేట జులై 5 ఆంధ్రజ్యోతి; జాతీయ రహదారిని నాణ్యతా లోపం లేకుండా నిర్మించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మత్స్య కొండబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన తమ పార్టీ నేతలతో కలిసి మండల కేంద్రంలో ఈ రహదారిని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పూర్తయి ఏడాది కాకుండానే కొన్నిచోట్ల బీటలు వారిందన్నారు. కొన్నిచోట్ల ఛిద్రమైనట్టు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రహదారి నాసిరకంగా చేపట్టడం సరికాదన్నారు. కలెక్టర్ స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి గిరిజన సమస్యలు



మాధవ్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు ప్రభాకరరావు, నాయకులు

చింతపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత సమస్యలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు తెలిపారు. శనివారం విశాఖపట్నం ఆయన నివాసంలో గిరిజన ప్రాంత బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలో జీవో 3 అమలుచేయాలని, ప్రతి గిరిజన గ్రామానికి రహదారులు, జన్‌మన్ పక్కా గృహాలు, జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి పథకాలు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చాఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి లకే భాస్కరరావు, జీకేవీధి ప్రధాన కార్యదర్శి చల్లంగి అచ్యుత్, సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి: సీపీఐ



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

కొయ్యూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించటంతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపి వేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుపై శనివారం రావణాపల్లి కేంద్రంగా సీపీఐ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, అదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇరవాడ దేముడు, ఉల్లి సూరిబాబు, గిరిజన సమాఖ్య అధ్యక్షుడు దర్శి సతీష్,వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వియ్యపు నానాజీ పాల్గొన్నారు.



పాడేరు రూరల్: గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో టీడీపీ నాయకులు



అరకులోయ: సుంకరమెట్టలో కరపత్రాలందిస్తున్న దొన్నుదొర, శివరామకృష్ణ

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

టీడీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు బుద్ద నాగ జగదీశ్

పాడేరురూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు బుద్ద నాగ జగదీశ్ సూచించారు. పాడేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నివాస గృహం కుమ్మరిపుట్టులో మండల ఎన్నికల పరిశీలకులు వంతాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎం పిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీకి మంచి పట్టు ఉందన్నారు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిలో మరింత చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. పాడేరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వర్తన నీలకంఠం, ప్రధాన కార్యదర్శిగా వర్తన వరలక్ష్మితో పాటు 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు. చింతలవీధి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గిడ్డి వెంకట్ రామ్ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కిముడు సురేశ్, జి.ముంచంగిపుట్టు పంచాయతీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంపిక చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎం.మణికుమారి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్ నాయుడు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఎన్నికల పరిశీలకుడు సత్యనారాయణ, వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, నాయకులు బొర్రా విజయరాణి పాల్గొన్నారు.

ఏడాది పాలనలో సంక్షేమం: శివరామకృష్ణ

అరకులోయ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టినట్టు టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు కరణం శివరామకృష్ణ అన్నారు. సుంకరమెట్టలో శనివారం టీడీపీ ఇన్‌చార్జి, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర, నాయకులతో కలసి సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ మహిళా నాయకురాలు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బొరిబొరి లక్ష్మి, పెదలబుడు వైస్ సర్పంచ్ చందూ విజయనిర్మల, సుంకరమెట్ట గ్రామ కమిటీ అధ్యక్షుడు కొర్ర సంజీవరావు, నాయకులు పెట్టెలి రాజ్‌కుమార్, నాయకులు మజ్జి అప్పలస్వామి, కిల్లో సిద్దు, వెంకటరావు పాల్గొన్నారు.

కూటమితో ప్రతి ఇంటా సంతోషాలు

డుంబ్రిగుడ: కూటమి ప్రభుత్వంతో గిరిజన కుటుంబాల్లో ఆనందం వెలువిరుస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు ఆనంద్ అన్నారు. మండలంలోని శనివారం గుంటగన్నేల, గుంటసీమ, తూటంగి, కొర్రా పంచాయతీ కేంద్రాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, చినగెన్ను, బోంజుబాబు, సీతారాం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం: డీపీవో



సింగర్భ గ్రామస్థులతో మాట్లాడుతున్న డీపీవో చంద్రశేఖర్

జి.మాడుగుల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యం సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి కేపి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని సింగర్భ, కె.కోడాపల్లి పంచాయతీ కేంద్రాలను శనివారం సందర్శించారు. స్థానికంగా ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పరిశుభ్రత, ప్రజారోగ్యం, ఐవీఆర్ఎస్ కాల్స్ తదితర అంశాలను గిరిజనులకు వివరించారు. తడి పొడి చెత్తలకు వేరు వేరుగా బుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రమేశ్, సిబ్బంది రవిశాస్త్రి, నాయకులు గంగరాజు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 36 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి రాము

అరకులోయ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఇన్‌చార్జి జడ్జి రాము ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 36 కేసులు పరిష్కారమైనట్టు కోర్టు సూపరింటెండెంట్ చక్రపాణి తెలిపారు. ఐపీసీ కేసులు 17, ఎక్సైజ్ కేసులు 8, పేకాట కేసు 1, లేబర్ కేసులు 3, మెంటైనెన్స్ కేసులు-2, ఓవర్‌లోడింగ్ కేసులు-5 పరిష్కరించినట్టు చెప్పారు. ఈ లోక్ అదాలత్‌లో స్థానిక సీఐ హిమగిరి, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల ఎస్ఐలు గోపాలరావు, పాపినాయుడు, శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది మల్లుదొర, మోహనరావు ఉన్నారు.

పాడేరు మెయిన్ రోడ్డు విస్తరించాల్సిందే..

» రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



బైఠాయించిన ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాడేరు మెయిన్ రోడ్డును గతంలో అధికారులు ప్రకటించిన రీతిలోనే విస్తరణ పనులు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని ప్రధాన రోడ్లను రెండు నెలల్లో విస్తరిస్తామని రెవెన్యూ అధికారులు ప్రకటించారన్నారు. అయితే,నామ మాత్రంగా ఆక్రమణ తొలగింపు చేపట్టి విస్తరణను విస్మరించారని ఆరోపించారు. సుమారు గంటకు పైగా ఆయన ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో కలెక్టరేట్ నుంచి బంగ్లాకు వెళుతున్న కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఎమ్మెల్యే వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎట్టి పరిస్థితుల్లో మెయిన్‌రోడ్డు ఇరువైపులా 50 అడుగుల మేర విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. సోమవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, ఆ మేరకు చర్యలు చేపడతామని కలెక్టర్ హామీతో ఎమ్మెల్యే ఆందోళన విరమించారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఐ దీనబంధు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

పెదబయలు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్రెడా సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లున్న ఏఎన్ఎం కె. కుమారి, ఎంపీహెచ్ఏ డి. చిట్టిబాబు, డీఏ బి. మత్స్యరాజులను శనివారం రూడకోట పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యారావు, సిబ్బంది, పంచాయతీ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతు బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు విధుల్లో ఎంతో నిబద్ధత, అంకితభావంతో పనిచేశారని కొనియారు. కార్యక్రమంలో గ్రామపెద్ద చెండా మత్స్యరాజు, 104 సిబ్బంది అజీత్, సూరి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ జీవో రద్దుకు తీర్మానం



టోకూరు సర్పంచ్ కిల్లో మోష్య అధ్యక్షతన గ్రామసభ

అనంతగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోకూరు పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ కిల్లో మోష్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన గ్రామసభలో హైడ్రోపవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ముందుగా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారానికి కృషిచేస్తామని సర్పంచ్ తెలిపారు. అనంతరం హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుకూలంగా ప్రభుత్వం జారీ చేసిన 51 జీవో రద్దు చేయాలని ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. టోకూరు పరిధి చిట్టంపాడు జలపాతం వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి సర్వే ప్రయత్నాలు వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసన్నశైలజ, వార్డు మెంబర్లు లక్ష్మణరావు, రామూర్తి, ప్రసాద్, పెసా కమిటీ సభ్యులు గోపన్న, ఆనంద్, మధు, రవి, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట; అనంతగిరి మండలం పెద్దకోట గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు తక్షణమే రద్దు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఈ మేరకు నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోండలరావు, గిరిజన సంఘం నాయకులు టి. కృష్ణారావు, పి. సోమన్న, సీపీఎం నాయకులు రామారావు లక్ష్మణరావు, లింగమూర్తి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో పెరుగుతున్న చెరకు విస్తీర్ణం

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో చెరకు సాగు విస్తీర్ణం ఇటీవల కాలంలో పెరుగుతోందని, గిరిజన రైతులు బెల్లం తయారీ ద్వారా ఆదాయాన్ని సంపాదిస్తున్నారని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. అఖిల భారత చెరకు సమన్వయ పరిశోధనా పథకం, గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా గిరిజన రైతులకు చెరకు సాగు విధానాలపై ఆర్ఏఆర్ఎస్‌లో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. శాస్త్రవేత్తలు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ కేవీ రమణమూర్తి, తదితరులు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. 25 మంది గిరిజన రైతులు శిక్షణలో పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై పోరాటం: ఈయూ

పాడేరురూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని లేకుంటే పోరాటం తప్పదని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి హెచ్చరించారు. శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డిపో మెయిన్ గేటు వద్ద డిపో అధ్యక్షుడు హిమ అధ్యక్షతన 2వ రోజు చేపట్టిన గేటు ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీపై కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని, డీఏ బకాయిలు, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ బకాయిలు ఇవ్వాలనారు. అనంతరం జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎస్‌కేఐ వల్లీ, కార్యదర్శిగా జె.చందు, జిల్లా ఉపాధ్యక్షుడిగా బి.రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.మోహన్‌రావు, డిపో కోశాధికారిగా ఎం.రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ సెక్రటరి యు తౌడయ్య, సీసీఎస్ మెంబర్ రామారావు, డిపో సెక్రటరీ పరమేష్, వీసీహెచ్.రావు, ఎన్ఎల్.రావు, పాల్గొన్నారు.

లుంగపర్తి పీహెచ్‌సీ తనిఖీ

అనంతగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంగుపర్తిలో పీహెచ్‌సీని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కమల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను క్షుణంగా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ నుంచి మందుల గదిని పరిశీలించి.. రోగులకు అందుతున్న వైద్యసేవలపై తెలుసుకున్నారు. అనంతరం బాలింతలతో మాట్లాడారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మంజుభార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.

వన సంపద అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మొక్కలను పరిశీలిస్తున్న ఫారెస్టు రేంజర్ మురళీక్రిష్ణ

ముంచంగిపుట్టు, జులై 5 (ఆంధ్రజ్యోతి): వన సంపద అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు ముంచంగిపుట్టు ఫారెస్టు రేంజర్ ఎం.మురళీక్రిష్ణ అన్నారు. ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఫారెస్టు రేంజర్‌గా పని చేసిన పి.వెంకయ్య చౌదరి బదిలీపై విశాఖ వెళ్లారు. తిరుపతిలో పనిచేస్తున్న మురళీక్రిష్ణ ఇక్కడికి వచ్చారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఫారెస్టు కార్యాలయంలో సరఫరాకు సిద్ధంగా ఉన్న మొక్కలను ఆయన పరిశీలించారు. ఫారెస్టు సెక్షన్ అధికారులు సీహెచ్.నారాయణపడాల్, ఎం.కార్తీక్, సుజనశ్రీ, ఫారెస్టు బీట్ అధికారులు కె.క్షను, ఎం.రామారావు,అనుషాలున్నారు.

ముగిసిన జగన్నాథస్వామి రథయాత్ర

ముంచంగిపుట్టు, జులై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామంలో జగన్నాథస్వామి తిరుగుప్రయాణం రథయాత్ర శనివారం ఘనంగా జరిగింది. 9 రోజుల అనంతరం చోటా ముక్కిపుట్టు నుంచి కొండపడ గ్రామంలోని గుండిచా మందిరంలో స్వామివారు కొలుదీరారు. పూజలు చేశారు. దారెల, జోలాపుట్టు, సరిహద్దు గ్రామాలైన ఒనకడిల్లీ, మాచ్‌ఖండ్ తదితర ప్రాంతాల్లో జగన్నాథస్వామి తిరుగు ప్రయాణ యాత్రను ఘనంగా జరుపుకున్నారు.

టీడీపీ సీనియర్ నేత రాంబాబు మృతి

చింతపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నేత మొట్టడం రాంబాబు అనారోగ్యంతో మృతి చెందారు. రాంబాబు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం సాయంత్రం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన పార్టీలో కార్యకర్తగా, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, మండల పార్టీ నాయకుడిగా పనిచేశారు. పార్టీ మండలాధ్యక్షుడు ముక్కలి రమేశ్, జడ్పీటీసీ సభ్యులు గంటా నళినీ ఆ కుటుంబానికి సంతాపం తెలిపారు.

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



మినుములూరులో ప్రచారం చేస్తున్న శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, తదితరులు

పాడేరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. పాడేరు మండలం మినుములూరు పంచాయతీ కేంద్రంలో పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజా శ్రేయస్సు, అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఈ ఏడాది కాలంలో రాష్ట్రాన్ని గాడిన పెట్టడడంతోపాటు అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధ్యానత ఇస్తూ ప్రజల శ్రేయస్సుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందన్నారు. పేదలందరికీ సంక్షేమ ఫలాలు, గ్రామాల్లో సదుపాయాలు, యువత భవిష్యత్‌కు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు వివరించారు. కేవలం ఏడాది పాలనలో దాదాపుగా 80 శాతం హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పథకాలతో పేదలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవిందరావు, నాయకులు డప్పోడి వెంకటరమణ, సర్పంచులు బాకూరు వెంకటరమణరాజు, పాండురంగస్వామి, శశిభూషణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

10న కళాశాలల్లో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు

పాడేరురూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మేనేజ్‌మెంట్‌లకు చెందిన కళాశాలలో ఈ నెల 10వ తేదీన విధిగా మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎస్.భీమశంకరరావు ఆదేశించారు. శనివారం ఆయన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలకు సంబంధించి కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సన్నాక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలతో పాటు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రగతి నివేదికలు సమావేశం రోజు తల్లిదండ్రులకు చూపించాలన్నారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులను, పూర్వ విద్యార్థులను, కళాశాల టాపర్లను ఆహ్వానించాలన్నారు.

సుజల స్రవంతి పూర్తికి యత్నిస్తా

... 5వ పేజీ తరువాయి

కల్యాణ మండపంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి తదితరులు హాజరై మాధవ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, తనపై ప్రేమతో ఇంత మంది వచ్చి అభినందనలు తెలిపారని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎప్పుడూ కృషిచేస్తానని, అందరితో సమన్వయంతో ముందుకు వెళతానని చెప్పారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను సన్మానిస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి తదితరులు

తరగతి గది చిన్నబోయింది..

... 5వ పేజీ తరువాయి



కొత్త యర్రవరం ప్రాథమిక పాఠశాలలో ముగ్గురికి పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయిని

పిల్లల నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినా ఫలితం లేకుండా పోతోంది. ప్రైవేటు పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది.ఎలమంచిలి మండలంలోని కొన్ని పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరనిపాఠశాలలున్నాయం టే పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థమవుతోంది. ఇక్కడ ఫౌండేషన్ పాఠశాలలు 4, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు 33తో పాటు మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 51 ఉన్నాయి. 3,482 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా పది మంది కంటే తక్కువమంది విద్యార్థులున్న పాఠశాలలు 15 వరకు ఉన్నాయి. రేగుపాలెం ఫౌండేషన్ పాఠశాలలో ఇద్దరు, కొత్త యర్రవరంలో ముగ్గురు విద్యార్థులే ఉన్నారు. లైను కొత్తూరులో 9 మంది, సోమలింగ పాలెం, మర్రిబంద, కేపీ పురంపాఠశాలల్లో నలుగురి చొప్పున ఉన్నారు. రామారాయుడు పాలెంలో ఎవరూ చేరక ఒకటో తరగతి ఖాళీగా ఉంది.

ప్రైవేటు పాఠశాలలపై ఆసక్తి

ప్రధానంగా ప్రైవేటు పాఠశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపుతుండడమే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణమని భావిస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ కుటుంబాల ప్రజలు పనుల నుంచి సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత వస్తుంటారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే సాయంత్రం 4 గంటలకే ఇంటికి వస్తారని, తాము వచ్చే వరకు వారి పర్యవేక్షణ ఇబ్బంది అవుతోందని, అదే ప్రైవేటు పాఠశాలలైతే సాయంత్రం 6 గంటల తరువాత పంపుతారని చెబుతున్నారు. ఈ విషయమై జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.అప్పారావు వివరణ కోరగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని చెప్పారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల చేరికకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి రోజూ ప్రణాళికాబద్ధంగా తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తున్నట్టు చెప్పారు.

మద్యం నేరాలపై నిఘా నేత్రం

... 5వ పేజీ తరువాయి

ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో 161 ప్రైవేటు వైన్ షాపులు ఉన్నాయి. అన్ని వైన్ షాపుల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రైవేటు ఐపీ నుంచి పబ్లిక్ ఐపీకి మారాలంటే బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ కనెక్షన్ ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు ఐపీ నుంచి ప్రైవేటు ఐపీకి మార్చేశారు. కాస్త మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేదు. కొన్ని గ్రామాలలో సిగ్నల్స్ సమస్య కారణంగా అవాంతరం ఏర్పడుతుందని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని చోట బీఎస్ఎన్ఎల్‌తో మాట్లాడి వేయిస్తున్నారు. ఇప్పటి వరకు 50 శాతం వైన్ షాపులలో పబ్లిక్ ఐటీకి మార్చడం జరిగింది. ఇంటర్నెట్ కనెక్షన్ లేని చోట బీఎస్ఎన్ఎల్ కేబుల్స్ వేస్తున్నారు. త్వరలో సీసీ కెమెరాలు కూడా నూరుశాతం కంట్రోల్ రూమ్‌ల పరిధిలోకి వస్తాయని అధికారులు అంటున్నారు. తొలి విడత ఎక్సైజ్ ఐ యాప్ ట్రయల్ రన్ పూర్తి చేసినట్టు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సుర్జిత్‌సింగ్ తెలిపారు. రెండో విడతగా మద్యం, నాటు సారా నేరాలను కూడా ఎక్సైజ్ యాప్‌లో చేర్చబోతున్నారని తెలిపారు. దీని వలన మోనటరింగ్ పెరుగుతుందని, మద్యం, నాటు సారా నేరాలపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఉల్లంఘునులపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

భారీ వాహనాలు బండరాళ్లను అనకాపల్లి, వయా ఎలమంచిలి మీదుగా, మరికొన్ని రేలుగుంట, మాకవరపాలెం మీదుగా రాంబిల్లి వైపు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. వందలాది ఇసుక ట్రాకర్లు నిత్యం జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే పరిమితికి మించి విద్యార్థులతో స్కూల్ ఆటోలు తిరుగుతున్నాయి. వీటిపై రవాణా శాఖ దృష్టి పెట్టింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తోంది. నెలలో రెండు రోజులు ఈ డ్రైవ్ కొనసాగనుంది. ఇప్పటి వరకు 44 కేసులు నమోదు చేసి రూ.97,480 జరిమానా విధించారు. ఎంవీఐలు రమణ, రాజన్న, వెంకటరావు బృందం వాహనాలను తనిఖీ చేసి పర్మిట్ లేకుండా నడుపుతున్న వాటిని సీజ్ చేస్తున్నారు.

యువతకు విస్తృత అవకాశాల కల్పనే లక్ష్యం

» స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వ్యవసాయ, పరిశ్రమలు, సేవా రంగాల్లో యువతకు విస్తృతమైన అవకాశాలు కల్పించడమే లక్ష్యమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గం విజన్ కార్యాచరణపై అధికారులతో తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను అధికారికంగా ఏర్పాటు చేశారు. యూనిట్ ఛైర్‌పర్సన్‌గా నియోజకవర్గ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్‌గా ఆర్డీవో వీవీ రమణ, సభ్యులుగా నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు ఉంటారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చడమే ప్రధాన లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. ఎంపీడీవో ప్రాంగణంలో యూనిట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు తగిన శిక్షణ ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే విజన్ కార్యచరణ ప్రణాళిక యూనిట్ లక్ష్యమని చెప్పారు. నిరుద్యోగ సమస్యను సమగ్రంగా అధ్యయనం చేసి దీర్ఘకాలిక పరిష్కార మార్గాలు చూపించే బాధ్యతను విజన్ సిబ్బంది చేపడతారన్నారు. విజన్ కార్యచరణ ద్వారా నియోజకవర్గ అభివృద్ధితో పాటు నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించగలమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుని సమీక్షించేందుకు క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, నాలుగు మండలాల తహసీల్దార్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సమాజం గర్వించేలా చదువుకోండి: ఎమ్మెల్యే బండారు

మాడుగుల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సమాజం గర్వించే విధంగా చదుకోవాలని, తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యపై ప్రత్యేక దృష్టిసారించి ఉన్నతంగా చదవాలన్నారు. దేన్నైనా మేధా శక్తితో సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చెప్పారు. ప్రధానంగా యువత చెడుకు దూరంగా ఉండాలని, మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేశారన్నారని, త్వరలో డిగ్రీ కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. అలాగే తాత్కాలిక షెడ్ల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన రూ.10 లక్షల చెకుకను ప్రిన్సిపల్ శాస్త్రికి అందించారు. అనంతరం డిగ్రీ కళాశాలలో చదువుతున్న 83 మంది విద్యార్థులకు రూ.2.23 లక్షల స్కాలర్‌షిప్ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ నాయకులు రంజిత్‌వర్మ, పుప్పాల రమేశ్, లెక్కల కాశిబాబు, నందాపు సన్యాసిరావు, కొట్టేడ మల్లిఖార్జునులు, పి.సూర్యనారాయణరాజు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు రూ.10 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

మాడుగులలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

మాడుగుల: మండల కేంద్రంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రభుత్వం అప్పుల్లో ఉన్నప్పటికీ మాటకు కట్టుబడి పథకాలు అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, పార్టీ మండల అధ్యక్షుడు అడ్డెపల్లి జగ్గారావు, నాయకులు కాశిబాబు, బి.రమణ, డిల్లీ నానాజీ, మంగరాజు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాల కరపత్రాలను ప్రజలకు అందిస్తున్న ఎమ్మెల్యే రాజు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

» చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

బుచ్చెయ్యపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మంగళాపురం, విజయరామరాజుపేట, భీమవరం, చిన్న అప్పన్నపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా? లేదా? అని ప్రజలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. పార్టీలకతీతంగా పథకాలు అందుతున్నాయన్నారు. అలాగే విజయరామరాజుపేట ఉన్నత పాఠశాలను సందర్శించి యూనిఫారాలు, పుస్తకాలు అందాయా? లేదా? అని విద్యార్థులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సీడీసీ మాజీ ఛైర్మన్ కర్రి తమ్మినాయుడు, నాయకులు దొండా నరేశ్, గిరిబాబు, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రగడలో ప్రత్యేక వైద్య శిబిరం


గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

మాకవరపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వజ్రగడ గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జర్వాలు ఉన్నాయని, అధికారులు పట్టించుకోలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు. స్పీకర్ ఆదేశాలతో డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి ఈ శిబిరం ఏర్పాటు చేయించారు. గ్రామంలో 12 మంది జ్వర బాధితులు ఉన్నట్టు గుర్తించారు.అనంతరం ఇంటింటికీ వెళ్లి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించినట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి రమేశ్, ఎస్ఈవో రమణ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ కోసం రైతుల నిరసన


గర్నికం డి.పట్టా భూముల్లో నినాదాలు చేస్తున్న రైతులు

రావికమతం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో దొర్లిన తప్పులు సవరించకపోవడంతో అన్నదాత సుఖీభవ పథకానికి నోచుకోలేకపోయామని గర్నికం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామంలోని తమ డి.పట్టా భూముల్లో శనివారం నిరసన తెలిపారు. గ్రామంలోని సర్వే నంబరు 78/1 నుంచి 13 వరకు ఉన్న ప్రభుత్వ భూమిలో ప్రభుత్వం 1989లో తమకు డి.పట్టాలు ఇచ్చిందని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి సదును చేయించి బోరు బావులు, విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకుని పండ్ల తోటలు సాగు చేసుకుంటున్నామని రైతులు చెప్పారు. రెవెన్యూ అధికారులు 2023లో నిర్వహించిన రీ సర్వేలో వీటిని ప్రభుత్వ భూములుగా మార్చేశారని, అప్పటి నుంచి పలు మార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఫలితంగా అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో తమ పేర్లు లేవని 16 మంది దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కె.గోవిందరావు, కేవీపీ పోరాట కమిటీ మండల కార్యదర్శి సిహెచ్.నూరిబాబు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన

రావికమతం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డంపింగ్ యార్డు స్థలానికి రెండు శాఖల అధికారులు శనివారం కసరత్తు ప్రారంభించారు. రావికమతంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో ఆవాసాల మధ్య చెత్త వేస్తున్నారు. దీంతో గ్రామస్థులను చెత్త సమస్య పట్టి పీడిస్తున్నది. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ గంజి మంగ, ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు పలుమార్లు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు, అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తహసీల్దార్ అంబేడ్కర్, ఈవోపీఆర్డీ సీతారామస్వామి, సర్వేయర్ శ్రీనివాస్, కార్యదర్శి కృష్ణమోహన్ గ్రామంలోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. వీటిపై అభ్యంతరాలను సమీక్షించి తగిన స్థలం ఎంపిక చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.


డంపింగ్ యార్డుకు శాశ్వత స్థలం కోసం పరిశీలన చేస్తున్న అధికారులు

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి


జైతవరంలో కంపోస్టు కిట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

చీడికాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్.చంద్రశేఖరరావు ఆదేశించారు. మండలంలోని జైతవరం, బి.సింగవరం, ఎల్‌బి.పట్నం పంచాయతీల్లో శనివారం పర్యటించారు. సంపద తయారీ కేంద్రాలు, వాటర్ ట్యాంకును పరిశీలించి మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు అందించారు. పంచాయతీ కార్యదర్శి ఎ.సన్యాసిరావు పాల్గొన్నారు.

సహిత విద్యా సేవలు వినియోగించుకోండి

బుచ్చెయ్యపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సహిత విద్య ద్వారా అందిస్తున్న సేవలను దివ్యాంగ విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈవో బి.కాశీ విశ్వేశ్వరరావు సూచించారు. దిబ్బిడి హైస్కూల్‌లో దివ్యాంగులు, వారి తల్లిదండ్రులకు సహిత విద్యా కార్యక్రమాలపై శనివారం అవగాహన కల్పించారు. 160 మంది దివ్యాంగులకు సహిత విద్య ద్వార సేవలు అందిస్తతన్నట్టు ఎంఈవో చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవోతో పర్యవేక్షణ లోపం

నాతవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలకు పర్యవేక్షణ కొరవడుతోంది. పూర్తి స్థాయి ఎంఈవో లేకపోవడం... ఇన్‌చార్జి ఎంఈవోకు మూడు బాధ్యతలు ఉండడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో పూర్తి స్థాయి ఎంఈవోను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తాండవ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న ఒ.సత్యనారాయణకు నాతవరం మండలానికి ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే రెండు బాధ్యతలు ఆయన నెత్తిపై ఉండగా, ఇవి సరిపోవన్నట్టు గొలుగొండ మండలానికి కూడా ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతలు అప్పగించారు. ఫలితంగా ఎంఈవో సత్యనారాయణ దాదాపు ఏడాది నుంచి మూడు చోట్ల విధులు నిర్వహించడం వల్ల ఏ పోస్టుకూ పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు. అలాగే ఈ విషయం తెలిసినప్పటికీ జిల్లా అధికారులుగాని, రెండు మండలాల ప్రజా ప్రతినిధులుగాని పట్టించుకోకపోవడం విశేషం. దీంతో నాతవరం మండలంలోని వివిధ పాఠశాలల పనితీరు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై పర్యవేక్షణ కొరవడుతున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నాతవరం మండలానికి పూర్తి స్థాయి ఎంఈవోను నియమించాలని వారు కోరుతున్నారు.

ఎమ్మెల్యే రాజును కలిసిన డీఎంహెచ్‌వో

చోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి శనివారం ఎమ్మెల్యే కేఎస్ ఎన్ఎస్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా వైద్య సదుపాయాలు, కొత్త పీహెచ్‌సీల ప్రతిపాదనలపై డీఎంహెచ్‌వోతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

చోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టాన్ని చేకూర్చే విధంగా రూపొందించిన లేబర్‌కోడ్‌కు వ్యతిరేకంగా ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం చోడవరంలో కార్మికులతో సమావేశమై కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన చట్టాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం లక్కవరం, గోవాడ, వెంకన్నపాలెం గ్రామాల్లో కలాసీలు, కార్మికులు, ఆటో, వాహనాల డ్రైవర్లతో సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌వీ.నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, దేవళ్ల, వెంకటరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో ప్రచారం

దేవరాపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మండల కేంద్రంలో శనివారం ప్రచారం నిర్వహించారు. అలాగే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బీటీ.దొర మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలను అమలు చేయాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల జీత భత్యాలు పెంచాలని డిమాండ్ చేశారు.

రహదారులపైనే చెట్టు కొమ్మలు

వాహన చోదకులు, రైతుల అగచాట్లు

ఫిర్యాదు చేసినా పట్టని విద్యుత్ అధికారులు

చీడికాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైలపూడి నుంచి జైతవరం వెళ్లే రహదారులపై చెట్టు కొమ్మలు ఉన్నాయి. విద్యుత్ వైర్ల కింద ఉన్న కొమ్మలను ఆ శాఖ అధికారులు తొలగించి రోడ్డుపై వేసేశారు. వీటిని తొలగించకపోవడంతో వాహన చోదకులు, రైతులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని జైతవరం ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు ఆరోపించారు. రెండు రోజుల్లో వాటిని తొలగించకపోతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.


బైలపూడి-జైతవరం రోడ్డుపైనే ఉన్న చెట్టు కొమ్మలు

లోక్ అదాలత్‌లో 784 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 784 కేసులు పరిష్కరించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) డి.శ్రీభరణి ఆధ్వర్యంలో ఈ అదాలత్ జరిగింది. సివిల్ కేసులు, ప్రిలిటిగేషన్, క్రిమినల్, ఎక్సైజ్, చెక్ బౌన్స్, బారాబర్లకు సంబంధించిన కేసులను ఇరు వర్గాల మధ్య రాజీ చేసి పరిష్కరించారు.

వైద్య సేవలు మెరుగుపర్చండి: డీఎంహెచ్‌వో

బుచ్చెయ్యపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్య సేవలను మెరుగుపర్చాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి ఆదేశించారు. శనివారం బుచ్చెయ్యపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. స్థానిక వైద్యాధికారి కె.రమేశ్‌తో మాట్లాడి ఓపీ సేవలు, ఫార్మసీ, ల్యాబ్ పరీక్షల గురించి ఆరా తీశారు. సేవలను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే వచ్చే రోగులకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వి.దేముడు, హెల్త్ సూపర్‌వైజర్ మామిడి రామకృష్ణ, సిబ్బంది పుణ్యవతి, వెంకటరమణ, పుష్ప పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను జయప్రదం చేయాలి


» మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీదేవి

చోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి కోరారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌కు సంబంధించి మండలంలోని పాఠశాలల హెచ్ఎంలు, సచివాలయ సంక్షేమ సహాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమావేశం నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలు, సమావేశం నిర్వహణకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అంబటి రామారావు, ఎస్ఐ జోగారావు, ఎంఈవోలు లక్ష్మణరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా దుర్గమ్మ

నర్సీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ఆకు కూరలు, పండ్లతో దుర్గమ్మను అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరిస్తామని అర్చకులు ఆదిత్య తెలిపారు.



వితంతు పింఛన్లు ఇవ్వాలని వినతి

చీడికాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్‌లు వెంటనే ఇవ్వాలని వైసీపీ మండల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం ఎంపీడీవో హేమసుందర రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వైసీపీ మండల అధ్యక్షుడు జి.రాజుబాబు, సీడీసీ ఛైర్మన్ ఎస్.శ్రీనివాసరావు, వరహాపురం హైస్కూల్ కమిటీ ఛైర్మన్ అప్పారావుయాదవ్, పి.చిన్నంనాయుడు, పి.మహేశ్, డి.కొండబాబు మాట్లాడుతూ మండలంలో భర్త చనిపోయిన సుమారు వంద మందికి పింఛన్లు మంజూరుకాగా, ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. అధికారులు స్పందించి ఈ పింఛన్లను వెంటనే ఇవ్వాలని కోరారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్

చోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్ చెప్పారు. మండలంలోని రాయపురాజుపేటలో శనివారం వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా సకాలంలో విత్తనాల పంపిణీ చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామునాయుడు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన

నర్సీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కార్మికులు ఆందోళనకు దిగారు. గేట్ మీటింగ్ నిర్వహించిన అనంతరం వారు ధర్నా చేశారు. జెండాలు పట్టుకొని డిమాండ్లు నెరవేర్చాలని నినదించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్షుడు వై.రామం, కోశాధికారి డీఈ.రావు, సభ్యులు పీవీఎస్.బాబు, ఎ.దేముడు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

బుచ్చెయ్యపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బడిగించడం ఆపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ధర్నా చేశారు. అనంతరం ఏఈ రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదానీ కంపెనీతో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందం వెనక్కి తీసుకోవాలని, పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆర్.వరహాలు, వి.సూరిబాబు, వి.సూరిబాబు, ముత్యాలు, రావడ నాయుడు, ఎర్రినాయుడు, రాము పాల్గొన్నారు.

తాండవ రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం

గొలుగొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవ రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధించినట్టు మత్య శాఖ అధికారిణి టి.నాగమణి తెలిపారు. పాతచెట్లపాలెం, సాలికమల్లవరం, వెంకటాపురం, గొలుగొండ జోగంపేట, గాదంపాలెం గ్రామాల్లో శనివారం మత్యకారులతో ఆమె సమావేశమయ్యారు. వచ్చే నెలాఖరు వరకు రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం అమలులో ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం చేపల సంతానోత్పత్తి సమయం కావడంతో నిషేధం ప్రకటించామన్నారు. ఈ సమయంలో మత్యకార్లు వేట సాగిస్తే లైసెన్సు రద్దు చేస్తామన్నారు. మత్యశాఖ అధికారులు యశోద, మత్యకార్లు తదితరులు పాల్గొన్నారు.